నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 14, 2024 | www.navatelangana.com

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాప వద్ద రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించి ఓరియంట్ సిమెంట్ ప్రెసిడెంట్ (మాన్యుఫాక్చరింగ్)తో మాట్లాడి మరమ్మతు చేయించాలని ఆదేశించినట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి బెల్లంపల్లి నుండి కాసిపేటకు తరలించాలని కోరడడంతో సంబంధిత శాఖతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, నస్పూరి నర్సింగ్, సామల లక్ష్మణ్ ఉన్నారు.



మిగిలిన కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపండి

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని ఏర్పాటుతో నష్టపోయిన దుబ్బపల్లి గ్రామంలో మిగిలిపోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని బాధిత కుటుంబాలు అభ్యర్థిస్తున్నాయి. ఎమ్మెల్యే వివేక్ సిఫార్సు లేఖతో శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ బలరామ్ నాయక్‌ను కలిసి న్యాయం చేయాలని కోరారు. రామారావుపేట్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన దుబ్బపల్లిలో ఇంకా 25 కుటుంబాలకు రికార్డులు సరిగా లేక పరిహారం ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపిస్తే గ్రామాన్ని వదిలి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ సర్పంచ్, ఎంపీటీసీ నామాల సత్యవతి తిరుపతి, ముదాం రమేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలు సీఎండీని కలిశాయి.

వసతి..అధోగతి..!

- ఎస్సీ, బీసీ వసతిగృహాలకు దరిచేరని బిల్లులు
- మూడు నెలల రాకపోవడంతో హెచ్‌డబ్ల్యూఓల తిప్పలు
- అప్పులు చేసి నిర్వహిస్తున్నామంటున్న అధికారులు

జిల్లాలోని వసతిగృహాలకు బిల్లులు జాడ లేకుండా పోయాయి. మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు(హెచ్‌డబ్ల్యూఓ)లు తిప్పలు పడుతున్నారు. గురుకులాల సంఖ్య పెరిగిన తర్వాత ప్రభుత్వాలు వాటిపైనే అధికంగా దృష్టిసారించడం మూలంగా నిరుపేద విద్యార్థులు ఉండి చదువుకునే వసతిగృహాల పట్ల అలసత్వ ధోరణి కనిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఎస్సీ, బీసీ వసతిగృహాలకు గత మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో అధికారులు తిప్పలు పడాల్సి వస్తోంది. విద్యార్థులకు భోజనం పెట్టేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి వస్తోందని వాపోతున్నారు. మెస్, కాస్మోటిక్స్ బిల్లులతో పాటు నిర్వహణ(మెయింటెనెన్స్) బిల్లులు కూడా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులు మాత్రం బడ్జెట్ విడుదల చేశామని.. అవి ఈ-కుబేర్‌లో క్లియర్ కాకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏండ్లుగా నిరుపేద విద్యార్థులకు వసతి కల్పిస్తూ చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్న వసతిగృహాల పట్ల సర్వత్రా నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. గతంలో గురుకులాలు అతి తక్కువగా ఉన్న సమయంలో ఎక్కువ మంది విద్యార్థులకు అండగా నిలిచిన ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల పట్ల ప్రభుత్వం అంతగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 22 వసతిగృహాలు ఉండగా.. సుమారు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బీసీ వసతిగృహాలు 14 వరకు ఉండగా 1165మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఉండే ఈ వసతిగృహాల్లో వివిధ మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పై చదువులకు అవకాశం లేకపోవడంతో అనేక మంది మండల, జిల్లా కేంద్రాలకు వచ్చి చదువులు కొనసాగిస్తున్నారు. ఇక్కడ నివాసముంటూ సమీపంలోని పాఠశాలలో చదువుకుంటున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఈ వసతిగృహాలు గురుకులాల సంఖ్య పెరిగిపోవడం..ప్రభుత్వాలు వాటికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో వీటికి ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. కానీ ఇప్పటికీ అనేక మంది నిరుపేద విద్యార్థులకు వసతి కల్పిస్తూ ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నాయనడంలో సందేహం లేదు.

మూడు నెలలుగా బిల్లులు లేవు

వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వమే మెస్ ఛార్జీలు, కాస్మోటిక్‌తో పాటు వసతిగృహాల మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.26 చొప్పున భోజనం బిల్లులు అందజేస్తోంది. ఇలా ఒక్కో వసతిగృహంలో సుమారు 50 నుంచి 100మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ సూచన మేరకు మెనూ ప్రకారమే భోజనం పెట్టాల్సి ఉంటుంది. ఉదయం టిఫిన్, రాత్రిభోజనం తప్పకుండా అందించాలి. సెలవు రోజుల్లో మూడు పూటలు పెట్టాల్సి ఉంటుంది. ఒక్కో వసతిగృహానికి ప్రతి నెలా రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లు రావాల్సి ఉంటుంది. కానీ ఎస్సీ, బీసీ వసతిగృహాలకు గత మూడు నెలల నుంచి బిల్లులు దరిచేరకపోవడంతో వసతిగృహాల అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరకుల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించలేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. సకాలంలో బిల్లులు రాకపోవడం మూలంగా అధికారులు ఇబ్బందులు పడుతుండగా.. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లభించడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం వీటి పట్ల దృష్టిసారించి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తే అనేక మంది నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బడ్జెట్ విడుదలైంది : రాజలింగు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి, ఆదిలాబాద్

జిల్లాలోని వసతిగృహాలకు సంబంధించి గతేడాది బిల్లులను ఏప్రిల్ వరకు అందజేశాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన మూడు నెలల నిధులు విడుదలయ్యాయి. ఈ- కుబేర్‌లో ఆలస్యం కారణంగా వారి దరికి చేరకపోవచ్చు. త్వరలోనే బిల్లులన్ని క్లియర్ అవుతాయి.

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు

- హౌస్ అరెస్ట్‌పై మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అండగా ఉండి పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. హైదరాబాద్‌లోని శేరిలింగపల్లిలోని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసంలో పార్టీ సమావేశం నిర్వహిస్తామని కార్యకర్తలు రావాలని బీఆర్ఎస్ పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసింది. మాజీ మంత్రి జోగు రామన్నను శుక్రవారం ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. ఇంటి నుంచి బయటకు రానివ్వకుండా పోలీసులు పహారా కాశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే గాంధీ గూండాలతో దాడికి పాల్పడ్డారన్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటికి వస్తున్న ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులను అడ్డుకోకుండా పోలీసులు ముందుండి మరీ రక్షణ కల్పించారన్నారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాత్రం అరెస్టులు చేస్తున్నారన్నారు. కేసీఆర్ హయంలో ఎన్నడూ ఇలాంటి దాడులు జరగలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తున్నందుకు గూండాయిజం చూపిస్తున్నారని ఆరోపించారు. దాడులకు ప్రతిదాడులు చేయడం పెద్ద విషయం కాదని, హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసే బాధ్యత తమపై కూడా ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రహ్లాద్, రోకండ్ల రమేష్, నారాయణ, గోవర్ధన్, అజీమ్, శివ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జోత్సవం



నవతెలంగాణ -ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌తో పాటు మండలంలోని చించాల, చింతకుంటతండా, ఎడ్‌బిడ్, రాంటెక్, బ్రహ్మన్‌గాం తదితర గ్రామాల్లో శుక్రవారం గణనాథుల నిమజ్జనోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథులను ప్రతిష్టించి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఎస్పీ డా.జానకి షర్మిల నేతృత్వంలో భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు ఎస్పీ రాంమందిర్‌లో గల సార్వజనిక్ గణేష్ మండలి వద్ద పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. వివిధ గ్రామాలలో గణేష్ లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ముధోల్‌లో బిజెపి మండల అధ్యక్షులు కోరి పోతన్న ముదిరాజ్ లడ్డూను వేలం పాటలో రూ.30వేలకు దక్కించుకున్నాడు. నిమజ్జనోత్సవం సందర్భంగా 10మంది ఎస్ఐలు, 8మంది సీఐలు, 200 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మత్తుపదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటుందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నశ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ర్యాలీని ముఖ్య అతిథులు ప్రారంభించారు. ర్యాలీలో కొంత దూరం నడిచి అవగాహన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ నేటి యువత మత్తు, గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని పేర్కొన్నారు. వారిని కాపాడి సన్మార్గంలో నడిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టడం అభినందనీయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల కాలంలో 100కు పైగా గంజాయి కేసులను నమోదు చేశామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గంజాయి విక్రయించినా, కొన్నా, పండించినా చట్టపరంగా నేరామన్నారు. గంజాయి రహిత ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, బ్రహ్మకుమారీస్ బహెనీ రేవతి, ఎక్సైజ్ శాఖ అధికారులు, డావ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దేవేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైపూర్ : కుందారం సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10.30 గంటల నుండి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. శెట్పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, మద్దులపల్లి, కుందారం, రుమ్మిపూర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సీతారాం మరణం దేశ రాజకీయాలకు తీరని నష్టం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు
- పార్టీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాదు, యావత్తు దేశ రాజకీయాలకు తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో పార్టీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను పార్టీ సీనియర్ నాయకులు బండి దత్త్రాతి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు మాట్లాడుతూ దేశం గొప్ప రాజకీయ మేధావిని కోల్పోయిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థపై పూర్తి స్థాయిలో పట్టుకలిగిన నేత సీతారాం ఏచూరి అని కొనియాడారు. విద్యార్థి దశలోనే ఎర్రజెండా భావాలవైపు మళ్లారని, జేఎన్‌యూలో ఎస్ఎఫ్ఐ నుండి మూడుసార్లు అధ్యక్షునిగా గెలుపొందారని తెలిపారు. వైస్ ఛాన్సలర్‌గా ఇందిరగాంధీ రాజీనామా చేయాలని తన ఇంటికే విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఐరన్ లేడీగా పేరున్న ఇందిరా గాంధీని తనముందే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. యూపీఏ మొదటి ప్రభుత్వంలో కామన్ మినిమమ్ ప్రోగ్రాం రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. విదేశీ కమ్యూనిస్టులతోనూ అవినాభావ సంబంధాలు కొనసాగించారని, పార్లమెంట్ సభ్యుడిగా 10సంవత్సరాలు సేవలందించారని తెలిపారు. బెస్ట్ పార్లమెంటిరియన్‌గా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. సిద్ధాంత విభేదాలు మరిచి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల వారితో ప్రశంసలు పొందారన్నారు. బతికుండగా దేశానికి సేవచేయడమే కాకుండా మరణించాక కూడా తన బాడీని మెడికల్ కళాశాలకు అప్పగించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. దేశం నేడు క్లిష్ట పరిస్థితిలో ఉందన్నారు. ఒక పక్క ఆర్థిక సంక్షోభం మరో పక్క రాజకీయాల్లోకి మతోన్మాద పోకడలు చొరబడ్డాయని పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలో దేశ రాజకీయాలకు ఏచూరి సేవలు ఎంతో అవసరం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు శ్రేణులు సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, ఎం.గంగన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున, నాయకులు కోవే శకుంతల, అగ్గిమల్ల స్వామి, ఎన్.స్వామి, పండగ పొచ్చన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేట :

లక్షెట్టిపేట : సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ భవనం ఎదుట సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంతమ్మ, సత్తక్క, రజిత, ఎల్లవ్వ, మల్లక్క పాల్గొన్నారు.

కెమెరాకు చిక్కిన అరుదైన పొనికి చెట్ల జాడ

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా అడవుల్లో అరుదైన పొనికి చెట్ల జాడ ఉన్నట్లు ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తెలిపారు. తాను అటవీ ప్రాంతానికి వెళ్లిన సందర్భంలో పొనికి చెట్టు కన్పించిందన్నారు. ఇవి దట్టమైన అడవులు, గుట్టలు, బండరాళ్ల మధ్య పెరుగుతాయన్నారు. ఇది అరుదుగా కనిపించే వృక్షమని తెలిపారు. ప్రస్తుతం ఈ చెట్లు కనబడకుండా పోయాయన్నారు. ఈ చెట్టు చెక్కలతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నిర్మల్ కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగిస్తారని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో భాగంగా ఆదిలాబాద్ మండలం ఖండాల అటవీ ప్రాంతానికి వెళ్లగా తన కంట పడ్డాయని పేర్కొన్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు వృక్షం ఫొటోను చూపించానని, అధికారులు పరిశీలించి పొనికి చెట్టుగా గుర్తించారని తెలిపారు. అరుదైన వృక్షం జిల్లా అడవుల్లో ప్రత్యక్షమవడం శుభపరిణామంగా భావిస్తున్నారు. ఈ చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కృష్ణ పేర్కొన్నారు.



గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఎస్పీ గౌస్ ఆలంతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించారు. వినాయక శోభాయాత్ర నిర్వహించే రూట్ మ్యాప్‌తో పాటు వినాయక్‌చౌక్, అంబేద్కర్‌చౌక్, చాందా(టి) వాగును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. 7, 9, 11 రోజుల్లో అధికంగా వినాయకుల నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. ఖానాపూర్‌లో మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం అక్కడి వీరహనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కలెక్టర్, ఎస్పీ, శిక్షణ కలెక్టర్లను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికార యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందన్నారు. 7, 9, 11వ రోజు అధికంగా నిమజ్జనాలున్నాయని, ఆ రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి రెవెన్యూ, పోలీసు అధికారులకు షిఫ్టుల వారీగా విధులు కేటాయించడం జరిగిందన్నారు. మున్సిపల్ తరపున గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెట్ల కొమ్మలు, వైర్లు అడ్డు వస్తున్నాయని పీస్ కమిటీ సమావేశంలో మండలపాల నిర్వాహకులు తెలియజేశారని, వాటిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు. ఉత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్సాహంగా జరుపుకునేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసిందన్నారు. వినాయక నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టిబందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. రూట్ మ్యాప్ ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, ఆర్డీఓ వినోద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఎంవీఐ శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్ సురేష్ కుమార్, సీఐలు సునీల్, కరుణాకర్‌రావ్, ప్రణయ్ కుమార్ ఉన్నారు.

పురుగుల అన్నం, నీళ్లలా కూరలు

- కస్తూరిబా, మోడల్ హాస్టళ్ల విద్యార్థుల ఆవేదన
- ఆకస్మికంగా తనిఖీ చేసిన బెల్లంపల్లి జడ్జి ముకేశ్



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని కస్తూరిబా పాఠశాల, మోడల్ హాస్టల్‌ను బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి జె.ముకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఒక్కొక్కటిగా చెప్పడంతో జడ్జి విస్మయానికి గురయ్యాడు. చాలా సమయం కేటాయించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు విని చలించారు. హాస్టల్‌లో ఉన్న వంట సామాగ్రి బూజు పట్టి ఉండడం, నాణ్యతలోపంగా ఉండడంతో 'మీ ఇంట్లో ఇలానే తింటారా?' అని జడ్జి సిబ్బందిని ప్రశ్నించారు. భోజనం దారుణంగా ఉంటుందని, మనుషులు తినలేని వంటలను తింటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని, గుడ్డు సగం మాత్రమే వేస్తున్నారని, మెనూ ప్రకారం భోజనమే లేదని, కూరలు నీళ్లలాగే ఉంటున్నాయని తెలిపారు. నాన్‌వెజ్ సమయంలో పులుసు తప్ప దానిలో ముక్క ఒక్కటి కూడా ఉండదని, ఏ వంట చూసినా దారుణంగా ఉంటుందని జడ్జికి వివరించారు. బాలికల వ్యక్తిగత సమస్యలను మహిళా న్యాయవాదితో మాట్లాడించి తెలుసుకున్నారు. ఇంత వరకు తమ సమస్యలు తెలుసుకున్న వారే లేరని, పట్టించుకునే వారే లేరని, మీరు వచ్చి మా సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థులు జడ్జికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాల పరిసరాలు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉండడంతో వెంటనే శుభ్ర పరచాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను, పాఠశాలల సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిప్ప మనోహర్, జనరల్ సెక్రెటరీ సింగతి రాజేశ్, జాయింట్ సెక్రెటరీ దాసారపు రాజు, సీనియర్ న్యాయవాదులు ఎల్.రాము, శివ కుమార్, రవికుమార్, మహిళా న్యాయవాది సంగీత, బాలకృష్ణ, సంతోష్, గోలి శ్రీనివాస్, మాదరి రాకేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్



ఆదిలాబాద్‌టౌన్ : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బాదన్ గంగన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు 25వ వార్డ్ పంజేషా కాలనీ వాసులు కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. వారందరికి శుక్రవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య చేరికలతో నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతమవుతోందన్నారు. ఇలాగే మంచి నాయకులను పార్టీలో చేర్చుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే టీపీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని తెలిపారు. సెప్టెంబర్ 17 నుండి జరిగే ప్రజా పాలనలో అర్హులకు రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చేలా శ్రేణులు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు బండారి సతీష్, యెల్మెల్వార్ రామ్‌కుమార్, జాఫర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ మున్నా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కమిటీని రద్దు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ కొరకు ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్‌లు బత్తుల రంజిత్, కుంటోళ్ల వెంకట స్వామి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్గీకరణ కమిటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని, సిట్టింగ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న కమిటీని తెలంగాణలోని మాలలు వ్యతిరేకించాలన్నారు. కమిటీని రద్దు చేయకపోతే రాబోవు రోజులలో కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వమని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడుకి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని, కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోకన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, పురుషోత్తం, రత్నయ్య, గిరి, నాని, భోజన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందజేత

నవతెలంగాణ-భైంసా



ఇటీవల భారీ వర్షాలు కురవడంతో భైంసా మండలంలోని వానల్ పాడ్ గ్రామానికి చెందిన కదం భోజరాం పటేల్ అనే యువకుడు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రూ.5లక్షల చెక్కును అందజేశారు. విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా ఈ సహాయాన్ని అందించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమం లో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌తో పాటు మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు గణేష్ పటేల్, సొలంకిభీంరావు, తాలోడ్ శ్రీనివాస్, సచిన్ పటేల్, చందర్ పటేల్, సాయరెడ్డి, భూమేష్ ఉన్నారు.

హైడ్రాకు మేం వ్యతిరేకం కాదు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- పక్షపాత ధోరణి వహిస్తే ఊరుకోం



నవతెలంగాణ-భైంసా

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైడ్రాకు బీజేపీ వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసాలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హైడ్రాలో రాజకీయ నాయకులకు, ధనవంతులకు, వదిలి పెడుతూ పేదలకు అన్యాయం చేస్తే సహించమన్నారు. చెరువుల అక్రమణల్లో తప్పు చేసిన వారందరికీ శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా పేదలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. హైడ్రా పక్షపాతంగా వ్యవహరిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని నిన్న బీజేఎల్పీ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. పేదలకు బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే, అందరికీ రేషన్ కార్డులు ఇస్తే కేంద్రం సరుకులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డు ఇవ్వకుండా పది సంవత్సరాలుగా వారి కడుపు కొట్టిందన్నారు. అదేవిధంగా గణేష్ నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

నవతెలంగాణ-తలమడుగు

తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌కు మండలవాసులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా డా.బీఆర్ అంబేద్కర్, వీరనారి ఐలమ్మ, కుమరంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ భవనంలో గణపతి విగ్రహానికి పూజలు చేసిన అనంతరం కార్యాలయంలోని గదులను పరిశీలించారు. మండలాధికారులు జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఐకేపీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన కాజా బటన్ బట్టల యంత్రాన్ని ప్రారంభించారు. యంత్రాల పనితీరు పట్ల ఐకేపీ ఏపీఎం స్వామిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మండల కేంద్రం నుంచి కోసాయి, ఉమ్రి వరకు ఆర్ అండ్ బి పనులు మంజూరైనప్పటికీ సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది రైతులు రుణమాఫీపై జిల్లా కలెక్టర్‌ను కోరగా దశలవారీగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా



స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి తీర్మానం చేసి పంపినట్లయితే వెంటనే మంజూరు చేస్తానని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ సుధీర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం స్వామి, డీటీ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిసెబుల్ వారి కోసం ప్రత్యేక చట్టాలున్న వాటి గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని భవిత విలీన విద్యావనరుల కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డీఈఓ ప్రణితతో పాటు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్రానికి వచ్చిన వారికి విద్యార్థులు సైన్ లాంగ్వేజ్‌లో స్వాగతం పలుకుతూ వారిని పరిచయం చేసుకున్నారు. అనంతరం డీఎల్ఎస్ఏ కార్యదర్శి విద్యార్థులకు బిస్కెట్లు, చాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగుల సంఘం నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ డిసెబుల్ వారికి కోసం అనేక చట్టాలతో పాటు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటి గురించి తెలియక నష్టపోతున్నారన్నారు. చట్టాలు, పథకాలపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సమస్యల పరిష్కారం తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ప్రభుత్వంతో పాటు కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమయ్య, భవిత కేంద్రం ఐఈఆర్పీలు పుష్పవేణి, డి.రాజన్న, వికాలంగుల సంఘం నాయకులు ఇమ్రాన్, సురేందర్, సోషల్ వర్కర్ అనిత పాల్గొన్నారు.

నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేట్ రంగంలో వచ్చే అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుంటూ రాణించాలని, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపాల్ డా.జె.సంగీత అన్నారు. శుక్రవారం కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కళాశాల టీఎస్‌కేసీ ప్లేస్ మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై వారి పేర్లను నమోదు చేసుకుంటూ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు పంపిస్తామని హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.జె.సంగీత మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రయివేట్ సెక్టార్‌లో కూడా ఉద్యోగాలు అనేకంగా ఉన్నాయన్నారు. నిరుద్యోగుల కోసం కంపెనీలు, బ్యాంకులు వారి వద్దకే వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందని, జాబ్ రాని వారు నిరుత్సాహ పడొద్దని కోరారు. ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికి ప్లెస్మెంట్ లభిస్తుందని స్పష్టం చేశారు. డిగ్రీ, బీటెక్ అర్హత కలిగిన 380 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జగ్‌రాం అంతర్వేది, సంతోష్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ శ్రావణి, మెంటర్ ఇమ్రాన్, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ మంజుల, కెరీయర్ గైడెన్స్ కోఆర్డినేటర్ శ్రీధరదేవి పాల్గొన్నారు.

మద్యం రహితంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

- ఏఎస్పీ అవినాష్ కుమార్
- భైంసాలో కొత్త ట్రెండ్ సృష్టిద్దాం



నవతెలంగాణ-భైంసా

ఈసారి గణేష్ ఉత్సవాల్లో భైంసాలో కొత్త ట్రెండ్ సృష్టించాలని, మద్యం తాగకుండా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని ఏఎస్పీ పి అవినాష్ కుమార్ సూచించారు. భైంసా పట్టణంలోని కిసాన్ గల్లీలో గురువారం రాత్రి గణేష్ హారతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మద్యం మహమ్మారి అన్నిటికీ హానికరమని, నిమజ్జనోత్సవాల రోజు నియమ నిష్టాలతో వేడుకలు జరుపుకోవాలన్నారు. యువత నిమజ్జనోత్సవంలో పాల్గొంటూనే, మళ్లీ లక్ష్య సాధన వైపు అడిగిడాలన్నారు. విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధించగలుగుతామని, ప్రతి ఒక్కరూ విద్య పట్ల ఆసక్తి పెంచుకోవాలని, యువతరానికి సూచించారు. తాను ఐపీఎస్ అయినప్పటికీ సమయం దొరికినప్పుడల్లా చదువుతానన్నారు. మన పెద్దలు సూచించిన మార్గంలో నడిస్తే, గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ వారి నషా ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని సూచించారు. బెహన్‌జీ మనిషా మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకూడదని, విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, శ్రేష్ఠ, పద్మ, చంద్రకాంత్, కృనాల్, పృథ్వి, నరేష్, సురేష్ పవార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎలుక రాజు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చెర ఫంక్షన్ హాల్‌లోని మాల సంఘం ఎన్నికల అధికారి సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం మాల సంఘం ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా బూరుగుల మల్లేష్, అధ్యక్షులుగా ఎలుక రాజు, ఉపాధ్యక్షులుగా బూరుగుల సందీప్ కుమార్, కోశాధికారి బోడ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా మునేశ్వర్ సోమన్న, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ నాపై నమ్మకంతో బోథ్ మండలాధ్యక్షుడిగా నాలుగో సారి ఎన్నుకున్నందున సంఘ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నావంతు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, నరేందర్ పాల్గొన్నారు.

పమార్, ఎర్రన్న, సంజు, సీఆర్‌పీ గంగాధర్, విద్యార్థులు ఉన్నారు.

సాయుధ పోరాటాలు కొనసాగిద్దాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని కుమురంభీం భవన్ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాటల కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు ప్రచార కార్యక్రమాలు సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. 1946 నుంచి 1951 వరకు సాయుధ సమరంగా సాగిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. భూస్వామ్య రాచరిక బానిసత్వంపై తిరగబడి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిందే వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మట్టి మనుషుల పోరాటమని అన్నారు. దొరల గడిలా బానిసత్వంపై ఎక్కుపెట్టిన పోరాటమన్నారు. ఆనాడు నిజాం రాజు నెహ్రూ మధ్య జరిగినటువంటి రాజ ఒప్పందంతో పటేల్ సైన్యాలు సెప్టెంబర్ 17న తెలంగాణకు వచ్చాయని అన్నారు. ఈ విధంగా ప్రజా విముక్తి పోరాటానికి విద్రోహం చేయడం కోసం విద్రోహం చేసినటువంటి కుట్రగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జగన్ సింగ్, వినోద్, సురేష్, రేణుక, సోయం జుగాదిరావు, అశోక్ సాయి, ఆనంద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం తప్పనిసరి



నవతెలంగాణ-ఉట్నూర్

పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం, పరిశుభ్రత తప్పని సరి అని వార్డెన్ నెహ్రూ అన్నారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా చెట్లను నాటి ప్రకృతిని ప్రేమించడం ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఇంధనం గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఒక్క చెట్టు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాథోడ్ మంగీలాల్, రజినీకాంత్, శ్రీనివాస్ రాథోడ్, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో తాంసి, తలమడుగు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన గృహ నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని గత పదిహేను రోజులుగా శిక్షణ కేంద్ర ఇన్‌చార్జీ మహేష్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డ్ కలిగిన నిరుద్యోగ యువకులకు లేబర్ డిపార్టుమెంటు వారి సౌజన్యంతో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ న్యాక్ ఆధ్వర్యంలో 15 రోజుల ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం అగస్టు 27 నుంచి, సెప్టెంబర్ 13 వరకు 25 మందితో 15 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. శిక్షణ సమయంలో రోజుకి రూ.3వందలు శిక్షణ భృతి రూ.4వేల5వందలు ఉచిత మధ్యాహ్న భోజనం యూనిఫామ్, స్టేషనరీ, స్టడీ మెటీరియల్స్ ఉచితంగా ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎన్ఎస్‌డీసీ, న్యాక్ సర్టిఫికెట్ ఇస్తామని అన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉండి లేబర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జీరాక్స్ రెండు పాస్ ఫోటోలతో సంప్రదించాలన్నారు. ప్రతి కార్మికుడు లేబర్ కార్డు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తోట నరేందర్, స్వామి, పొచ్చన్న, రాములు, భూమన్న, అడెల్లు, దత్తు, వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు ఉన్నారు.

పెంబిలో ప్రభుత్వ భూమి స్వాధీనం



నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 205, 202 ప్రభుత్వ భూమిని సర్వే చేసి, అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రత్యేక బృందం అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి సుదర్శన్ మాట్లాడుతూ పెంబిలోని సర్వే నెంబర్ 205లో 6ఎకరాల 30 గుంటలు, 202 సర్వే నెంబర్‌లో 1 ఎకరం 12 గుంటలు ప్రభుత్వ భూమి ఉందని, భూమిని సర్వే చేసి హద్దులు, బోర్డు పెట్టినట్టు తెలిపారు, గ్రామ వీడీసీ, నాయకులు సమక్షంలో పంచనామా నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, సర్వేయర్‌లు కిసాన్, శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ శ్రవణ్, వీడీసీ అధ్యక్షులు పుప్పాల నర్సయ్య మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సల్ల రమేశ్వర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు రాజలింగు, మోహన్‌రెడ్డి, తులాల శంకర్, కుర్మా రాజేందర్, కృష్ణారెడ్డి, గోవింద్, చింతకింది రాజేందర్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నవతెలంగాణ-కుభీర్

విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటరు లిస్టు విడుదల



నవతెలంగాణ-నార్నూర్

స్థానిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ స్వప్నశీలా కార్యదర్శులతో కలిసి గ్రామాల వారీగా వార్డు, ఓటరు లిస్టు విడుదల చేశారు. 23 గ్రామపంచాయతీ కార్యాలయంలో వార్డుల ఓటరు లిస్టు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ఉన్న ఓటరు లిస్టును ఓటరు పేర్లను చూసుకోని సరి చూసుకోవాలి సూచించారు. ఎటువంటి పేర్లు వివరాలు తప్పు ఉంటే తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు. కార్యదర్శులు సమయానుసారంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. వారి వెంట 23 గ్రామపంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా జనని ఫౌండేషన్ చైర్మెన్ తోట సుమిత్ మాట్లాడుతూ పేదలకు అండగా నిలువాలన్న ఆకాంక్షతో, సమాజహితం కొరకు జనని ఫౌండేషన్ స్థాపించామని అన్నారు. జనని ఫౌండేషన్ 4వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తమ వంతు సహకారంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొప్పుల ప్రదీప్, తాళ్లాపెళ్లి రాజ్ గంగన్న, చింతపండు రవి, మట్టేరి రాజశేఖర్, భాషెట్టి శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగోజీ తండాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హస్నాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రిఫత్, హెల్త్ సూపర్‌వైజర్ కిషన్, ఏఎన్ఎం దీప, ఆశా కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, గ్రామస్తులు ఉన్నారు.



మృతురాలి వివరాలు తెలుసుకున్న అదనపు వైద్యాధికారిణి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని అందుతండాకు చెందిన బాలింత వాఘ్మారే దీక్ష గత నెలలో ప్రసూతిలో ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి మరణించింది. ఆమె మృతికి గల కారణాలను జిల్లా అదనపు వైద్యాధికారిణి డా. సాధన మృతురాలి ఇంటికి వెళ్లి నిర్మల్ ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన డెత్ రిపోర్ట్‌ను పరిశీలించారు. మృతికి గల కారణాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు సమాచారం. ఆమె వెంట స్థానిక వైద్యాధికారి డా.శ్రీకాంత్ ఉన్నారు.

హిందీ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ భాష హిందీ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందీ భాషా ప్రేమికులు, హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులంతా కలిసి హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పేట్కులే శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం అన్ని పాఠశాలలో, విద్యాసంస్థల్లో, కళాశాలలో, ప్రభుత్వ రంగ సంస్థల్లో, కేంద్ర కార్యాలయాల్లో హిందీ దినోత్సవ కార్యక్రమాలు జరుపుకోవాలని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య సమరంలో భారతదేశాన్ని ఏకం చేసి, భారతీయులందరినీ ఒకతాటిపై తీసుకొచ్చి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన హిందీ భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ భాషా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యావాలంటీర్లను నియమించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన చోట విద్యా వాలంటీర్లను నియమించాలని, టీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల బదిలీలు పదోన్నతులు ముగిసినా చాలామంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువ ఉందని, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను త్వరగా విడుదల చేయాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
3
శనివారం | సెప్టెంబర్ 14, 2024 | www.navatelangana.com

పోషకాహారంపై అవగాహన

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని అమరగొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై గర్భిణీలు, బాలింతలకు శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ వజ్రమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలను ప్రదర్శించి వాటిలో లభించే పోషక విలువలను వివరించారు. గర్భిణీలు బాలింతలు తప్పనిసరిగా అన్ని రకాల పోషక ఆహారాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఒక్కరికి పోషక పదార్థాలను అందజేస్తుందని అన్నారు.

టీఎన్వీ రమణను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



టీఎన్వీ రమణను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. టీఎన్వీ రమణ రెండవ వర్ధంతిని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, టీఏజీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణ ఆసిఫాబాద్ జిల్లా ప్రజా సంఘాలను నిర్మించారన్నారు. ఉద్యోగం వదిలి ఉద్యమం వైపు వచ్చారన్నారు. సమస్యలపై ఉద్యమించిన వ్యక్తి అల ఆశయాలను కొనసాగించే దిశగా యువత ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు ఆత్మకూరు సతీష్, వడ్లూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకురాలు, చిట్టి భారతి అక్షయ, సంతోష్, ఆసిఫ్ పాల్గొన్నారు.

తెలంగాణ పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 17వ తేదీన తెలంగాణ పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి జిల్లా అధికారులతో పాలనా దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు విభాగాల వారీగా కేటాయించిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, స్థానిక సీఐ సతీష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీఎన్‌వీ రమణకు ఘనంగా నివాళులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీపీఐ(ఎం) పార్టీ నాయకుడు టీఎన్‌వీ రమణ రెండో వర్ధంతి సందర్భంగా శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించాయి. కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో సీపీఐ(ఎం), ప్రజాసంఘాలు, టీఏజీఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సంఘాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. సిర్పూరు పేపర్ మిల్లులో మంచి ఉద్యోగాన్ని వదులుకొని ఉద్యమం వైపు నిలవడమే కాకుండా మరెంతో మందిని ఉద్యమం వైపు మళ్లించాడని అన్నారు. రమణ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజాసంఘాల నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, ముంజం శ్రీనివాస్, కోట శ్రీనివాస్, చాపిలె సాయికృష్ణ, వసాకె సాయి, నితీష్, జాడి మల్లయ్య, అల్వాల చంద్రయ్య, జి సంజీవ్, ఈ శంకరమ్మ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపల్లి, అగర్‌గూడ గ్రామాల నుంచి బియ్యం అక్రమ రవాణ అవుతుందని సమాచారం మేరకు స్థానిక పోలీసులు, విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించి ప్రధాన రహదారిపై వెళుతున్న బొలెరో వాహనంలో 21 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. బియ్యాన్ని స్వాధీన పరుచుకుని బొలెరో డ్రైవర్ పాముల మహేష్‌ను విచారించగా కాగజ్ నగర్ కు చెందిన సయ్యద్ సహాబాద్ చెందిన వాహనమని దీనిలో అమీర్, రాజేష్ అనే ఇద్దరు వ్యక్తులు బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ వ్యాపారానికి పవన్, ఆవేజ్ ఖాన్‌లు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని సివిల్ సప్లై గోదాముకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ తహసీల్దార్ దినేష్ రెడ్డి, సీఐ అనిల్ కుమార్, డీటీ పోచయ్య, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ లిబిన్, కరస్పాండెంట్ అనిమాథ్యూ తెలిపారు పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రామగిరి వేదాంత ఎంపిక కాగా విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 16 వరకు వరంగల్ జిల్లా హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థిని పీఈటీలు కడతల రాకేష్, బొమ్మకంటి కిరణ్, అర్చన కుమారి, ఆత్రం బద్రి, ఉపాధ్యాయురాలు పసల థామస్ అభినందించారు.

వైద్య కళాశాలలో బోధన సిబ్బంది పోస్టులకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన బోధన సిబ్బంది పోస్టులను గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేసేందుకు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సతీష్ ఒక ప్రకటనలు పేర్కొన్నారు. వివిధ విభాగాలలో 6 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 20 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 52 సీనియర్ రెసిడెంట్ పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని, విద్యార్హత, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు మిగిలిన అర్హత పత్రాల ఒరిజినల్స్, నకలు ప్రతులతో సకాలంలో హాజరుకావాలని తెలిపారు. వయోపరిమితి సెప్టెంబర్ 9, 2024 నాటికి 69 సంవత్సరాల లోపు ఉండాలని, పోస్టుల ఖాళీలు, విద్యార్హత వివరాలకు కళాశాల వెబ్ సైట్ జీఎంసీకుమురంభీంఆసిఫాబాద్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పోషణ మాసం పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శుక్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో చేపట్టిన పోషణ మాసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఇందులో భాగంగా పసిపిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు జీవన ప్రయాణం, అనుబంధ పోషక ఆహారం, పౌష్టికాహారం, న్యూట్రి గార్డెన్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మానసిక, శారీరక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు అవసరమైన మందులు అందించాలని, పరిశుభ్రత, అదనపు ఆహారం తినిపించడంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల, జిల్లా అధికారులు తరచుగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మెనూ ప్రకారం ఆహారం అందించని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శామ్-మామ్ కార్యక్రమంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ



సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొని వారి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హిమోగ్లోబిన్ కనీసం 12 గ్రాములు పైగా ఉండేలా అవసరమైన మాత్రలు, పౌష్టిక ఆహారాన్ని అందించాలని తెలిపారు. అనంతరం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ సిబ్బందికి పెండింగ్ ఎరియర్స్ చెల్లించడంతోపాటు, ఇతర మున్సిపాలిటీలలో చెల్లిస్తున్నట్లు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోకుంటే సమ్మెకు వెళ్తామని మున్సిపాలిటీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్ హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారితో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో తేదీన ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవతరించిదన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను అప్పటి నుండి కేటగిరీల విభజించాలన్నారు. కార్మికుల వేతనాలను నిర్ణయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర మున్సిపాలిటీలో ఇస్తున్న వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆవిర్భావం నుంచి ఉన్న పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలన్నారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారాల కోసం చర్యలు తీసుకోవాలని లేదంటే ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మాట్ల రాజు, కార్యదర్శి తోట సమ్మయ్య, కోశాధికారి ఇగురపు బాపురావ్, నాయకులు లక్ష్మీ, పద్మ సిడం మోతీరాం, ఇస్తారి, సాగర్, శ్రీనివాస్, బాలేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆస్పత్రి కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్‌వైజర్ల పెండింగ్ వేతనాల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం కొనసాగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు విడుదల చేయలేదని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచితే కార్మికుల జీవనం సాగేది ఎలా అని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు నెలవారి ఈఎంఐలు పొదుపు సంఘాల చెల్లింపులు పిల్లల ఫీజులు కట్టుకోలేక మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జిల్లా ఏరియా సిహెచ్‌ఎస్సి ఆస్పత్రుల కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదని అన్నారు. మానవత దృక్పథంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతినెల 5వ తేది లోపు వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో



ఆస్పత్రి కార్మికులు మల్లేష్, మురళీ, సత్తార్, మమత పాల్గొన్నారు.

పనివేళలు మార్చడం సరికాదు : పీఆర్‌టీయూ



నవతెలంగాణ-దహెగాం

జిల్లా విద్యాధికారి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లాలోనే పాఠశాల పని వేళలను తన ఇష్టానుసారంగా మార్చడం సరికాదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం మండలములోని బిబ్రా గ్రామంలో పీఆర్‌టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొయ్యాడ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరం శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా దూడం తిరుపతి, మహిళా ఉపాధ్యక్షురాలుగా అనురాధ, కార్యదర్శిగా శ్రీకాంత్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలో దాదాపు 500 ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై అధిక పని భారం ఒత్తిడి పెరుగుతుందని, ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇష్టారీతిగా పాఠశాల పని వేళలను మార్చటాన్ని పిఆర్టియుటిఎస్ ఖండిస్తుందన్నారు. పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకే పని వేళల్లో ఉపాధ్యాయులు పనిచేస్తారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వే కొరకు ఉపాధ్యాయులు పాఠశాల సమయంలోనే విద్యార్థులకు బోధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొమురయ్య, సరిత పాల్గొన్నారు.

బీఈడీ కళాశాల ఎదుట ప్రజా సంఘాల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధిస్తున్న జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల ఎదుట కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ కళాశాలలో 2021-23 విద్యా సంవత్సరంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏడాది గడుస్తున్నప్పటికీ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారని, ప్రభుత్వం ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్‌తో సంబంధం లేదని విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. కలెక్టర్ కు వినతి ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదని అన్నారు. అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం



పోలీసులు అక్కడికి చేరుకుని వారిని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, అధ్యక్షుడు టీకానంద్, బీసీ యువజన సంఘం నాయకుడు ప్రణయ్, వివిధ సంఘాల నాయకులు మాలశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలేయాలని విజ్ఞాన దర్శనం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. విజ్ఞాన దర్శనం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంత్రాల పేరుతో తంత్రాల పేరుతో ప్రజలు విద్యార్థులు తమ ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారని, వాటిని నమ్మకూడదని తెలిపారు. విద్యార్థులు విజ్ఞానం పైన ఎక్కువ దృష్టి పెట్టాలని మూఢనమ్మకాలను తరిమికొట్టే విధంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ రకాలుగా మ్యాజిక్కులు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టికనంద్, గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరంగ మాలాశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు ఆత్మకూరు సతీష్, వడ్లూరి శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు నగేష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, విజ్ఞానదర్శిని రాష్ట్ర నాయకులు ఆదం రాజు, మొహమ్మద్ అలీ, మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చిట్టి భారతి, అక్షయ, రమేష్ పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన సీతారాం ఏచూరి జెఎన్‌యులో యూనివర్శిటీ సమస్యల పరిష్కారం కోసం పోరాడారని అన్నారు. 1977 నుండి 1978 వరకు వరుసగా మూడుసార్లు జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పని చేశారని అన్నారు. విద్యార్థి సంఘంలో పని చేస్తూనే అనేక ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూ, ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టు కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ సతీష్, కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు తేజస్విని, శృతి, చిత్తరంజన్, హుమరబేగం, సహాయ కార్యదర్శులు అఖిల, ప్రవల్లిక, జయప్రకాష్, నాయకులు తిరుమల, ఝాన్సీరాణి, పూజ, అనూష, సంజన, పవన్ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా జిల్లాలోని అసిఫాబాద్ మండలానికి చెందిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి మండల కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ శీనివాస్ తెలిపారు. గ్రామపంచాయతీల్లోని వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేసినట్లు వివరించారు. మండలంలోని ఓటర్ తమ పేరు నమోదు అంశాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓకార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వెల్గీ, లక్ష్మీపూర్‌లో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని వెల్గీ, లక్ష్మీపూర్ గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించి ఆయా గ్రామాల్లోని 10 మంది రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్ప, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ రంగాలలో అర్హులైన మైనారిటీలకు వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనకు ఆయా శిక్షణ సంస్థల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన మైనారిటీలు (ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సికులు)కు వివిధ రంగాలలో (ఐటి, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్స్ట్రక్షన్, వెటర్నరీ-డైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్, టూరిజం-హాస్పిటాలిటీ, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్) వృత్తి శిక్షణ ఇచ్చేందుకు ఆయా సంస్థలను ట్రైనింగ్ పార్టనర్లుగా నియమించేందుకు ప్రభుత్వ ప్రయివేట్ వృత్తి శిక్షణ సంస్థల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఈ సంస్థలు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ), టాస్క్, ఈజీఎంఎం మెప్మాతో గుర్తింపు లేదా అనుసంధానం కలిగి ఉండాలని తెలిపారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్‌తో గుర్తింపు పొంది ఉండాలని, అర్హత, ఆసక్తి గల సంస్థలు తమ దరఖాస్తులను హైదరాబాద్-నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని, ఇతర వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం ముసాయిదా ఓటరు జాబితా గ్రామపంచాయతీలలో వార్డుల వారీగా ప్రచురించడం జరిగిందని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముసాయిదా జాబితాపై ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు తెలియజేయాలని, ఈ నెల 26వ తేదీ వరకు పరిశీలించి గ్రామపంచాయతీ తుది ఓటర్ల జాబితాను 28వ తేదీన అన్ని గ్రామపంచాయతీలలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు.

ప్రేరణ ఉత్సవ్ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి గుండేటి వర్షిత్ జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమానికి ఎంపికయ్యాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ నెల 1 నుంచి 7 వరకు అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.



ఓటరు జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కాసిపేట



మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రదర్శించారు. దీంతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో సైతం పంచాయతీల వారీగా, వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రదర్శన చేశారు. మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలకు 190 వార్డులు కాగా పురుష ఓటర్లు 12887, స్త్రీ ఓటర్లు 13000, ఇతరులు 4, మొత్తం 25891 మండల ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పొందుపర్చారు. డ్రాఫ్ట్ ఓటరులో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సఫ్దర్ ఆలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

శనివారం | సెప్టెంబర్ 14, 2024 | www.navatelangana.com

అక్రమంగా అరెస్టులు అమానుషం

నవతెలంగాణ-జైపూర్



కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలు అక్రమంగా అ రెస్ట్ చేయడం అమానుషమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవింద రావు అన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ పిలుపు మేరకు హైదరాబాద్ తరలివెలుతున్న బీఆర్ఎస్ నాయకులను శు క్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనిచివేతలకు ఉద్యమకారుడైన కేసీఆర్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పోరాటాన్ని అపలేరని అన్నారు. భీమారం మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు కలెగూర రాజకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ తరలివెలుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో అరెస్ట్ చేయించడం సరికాదన్నఆరు. తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్రం కోసం ముందుండి పోరాడిన బీఆర్ఎస్ నాయకలు, కార్యకర్తలు అక్రమ అరెస్టులకు భయపడరని అన్నారు.

ఎంజేపీలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలలో శుక్రవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ అండర్-14,16,18 అండ్ 20 బాయ్స్ అండ్ గర్ల్స్ డిస్ట్రిక్ట్ లెవెల్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. దీనిలో ఎంపికైన వారు ఈ నెల 19, 20న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంజేపీ జిల్లా కన్వీనర్ శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ఒలింపిక్స్ స్థాయి ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ మారయ్య, సెక్రటరీ బాబురావు, ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని షెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయులను స్థానిక మాజీ సర్పంచ్ మేడి రవి ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులను పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. పాఠశాల నిర్వాహణలో తమ వంతుగా సేవలందించిన ఉపాధ్యాయులకు ఈ సంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇదేవిధంగా మరిన్న ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

మాజీ జడ్పీటీసీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-వేమనపల్లి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి తాజా మాజీ సర్పంచ్ గాలి మధు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, చెన్నూరు పురుషోత్తం మధుసూదన్, మోర్ల రమేష్, ఇగురం జగన్ నాయిని శంకర్, వేమనపల్లి మాజీ సర్పంచ్ తోకల రామచందర్, కొండ బాపు, శేఖర్, గణపురం సంతోష్, డొబ్బల సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వన మహోత్సవం కింద నాటిన మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా నర్సరీ కోసం స్థల ఎంపిక చేయాలని, ఈ నెల 17వ తేదీన 'అమ్మ కొరకు మొక్క' అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలలో రికార్డ్స్ అన్ని అప్డేషన్ చేయాలని తెలిపారు. అదే విధంగా పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్య ప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని ప్రతిష్టించిన యూత్‌కు ప్రశంస

నవతెలంగాణ-మందమర్రి

పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి వినాయకున్ని ప్రతిష్టించిన అక్షర యూత్ సభ్యులను తహసీల్దార్ సతీష్ ప్రశంసించారు. శుక్రవారం అక్షర యూత్ గణేష్ మండపంలో వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు అనంతచార్యులు, నరసింహచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు శనివారం 33 కేవీ మరమత్తుల నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని లక్షెట్టిపేట ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

జీపీల్లో ఓటరు జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పోన్కల్, జన్నారం, తిమ్మాపూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డ్‌పై ఆ గ్రామ ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ గ్రామంలోని అన్ని వార్డుల్లో ఉన్న ఓటర్ల జాబితాను శుక్రవారం ఆ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై అంటించామని ఈవో రాహుల్ ఆయా గ్రామాల కార్యదర్శులు తెలిపారు. ఓటర్లు ఆ జాబితాలో ఉన్న పేర్లను వివరాలను సరిచూసుకోవాలని వారు సూచించారు.

సీతారాం ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు కల్లేపల్లి విక్రమ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏచూరి చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి జీవితం తెరిచిన పుస్తకం లాంటిదన్నారు. భూమి, భుక్తి, పీడిత జన విముక్తి కోసం పోరాడిన మహనీయుడన్నారు. యుపీఏ హయాంలో కామన్ మినిమం ప్రోగ్రాం ద్వారా ఎంతో మందికి ఉపయోగ పడుతున్న ఈజీఎస్ లాంటి పథకాలను ప్రభుత్వాలకు సూచించారన్నారు. పేదల పక్షాన పార్లమెంట్‌లో శాస్త్రీయ బద్ధంగా పోరాడారని అన్నారు. పేదల పక్షాన మాట్లాడే గొంతు మూగబోవడం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శనాల నవీన్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, యూత్ నాయకులు దర్శనాల రమేష్, ఊరేడి రాజ్ కుమార్, దర్శనాల చంద్రయ్య, మడిపెల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

జన్నారం : సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ మండల కార్యదర్శి కనికారం అశోక్, నాయకుడు గుడ్ల రాజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని సుందరయ్య నగర్ కాలనీలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీతారాం ఏచూరి పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అతని మృతి పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి ప్రవేశం చేసి పార్టీలో సుదీర్ఘంగా పనిచేసిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూకటికారి బుచ్చయ్య కొండ గొర్ల లింగన్న, అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ పాల్గొన్నారు.

జైపూర్ : కమ్యూనిస్టు యోధుడు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని దేశం ఒక పోరాట యోధున్ని కోల్పోయిందని ఎమ్మెల్యే వివేక్ వెంటస్వామి అన్నారు. విలువలు సిద్దాంతాల కలబోతగా తన రాజకీయ ప్రస్థానం చివరి వరకు కొనసాగించిన సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని అభిప్రాయపడ్డారు. ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తాండూర్ : ఐబీ కేంద్రంలో శుక్రవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘన నివాళ్లు అర్పించారు. మండల కార్యదర్శి దాగాం రాజారాం మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఒక ధ్రువతార అని కొనియాడారు. దేశంలోని పీడిత ప్రజల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. దుర్గ నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం పాల్గొన్నారు.

తాండూర్ : ఏచూరి ఆశయ స్ఫూర్తితో పేద ప్రజల అభ్యున్నతి కోసం ఉద్యమించాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని ఎంసీపీఐయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏచూరి విద్యార్థి దశ నుండే వామపక్ష విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితుడై తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, సతీష్, ఆకాష్, వేణు, సురేష్ పాల్గొన్నారు.



జన్నారంలో..



జైపూర్‌లో..



తాండూర్‌లో..

నియంత పాలన సాగిస్తున్న కాంగ్రెస్



నవతెలంగాణ-జన్నారం

ప్రజా పాలన ముసుగులో రేవంత్ నియంత పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నాయకులపై పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను వదిలి బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. సీఎం కనుసన్నల్లో సాగుతున్న ధ్వంద విధానాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని విమర్శించారు. నిర్బంధాలు అరెస్టులు ఆంక్షలు బిఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని అరెస్టులకు బెదిరేది లేదని అధికారం ఎవరికీ శాశ్వతం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కమ్మల విజయ ధర్మ, జిల్లా నాయకులు సిటిమల భరత్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, జిల్లా నాయకులు ఫజల్ ఖాన్, బోర్లకుంట ప్రభుదాస్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఐలవేణి రవి, శ్రీధర్ రావు, దుమల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

ఏదీ రూ.2లక్షల రుణమాఫీ..?

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్



అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలలు గడిచినా ఏక కాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేయలేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శుక్రవారం కోటపల్లి మండలం రొయ్యలపల్లిలో కావిరి రాజబాబు అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ(ఎం) శాఖ మహా సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హాయాంలో దేశంలో మహిళలపై హత్యాచారాలు, హత్యలు పెరిగి పోతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. తెలంగాణాలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన తీరును గుర్తు చేశారు. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వంలో హక్కు పత్రాలు ఉన్న వారికి సైతం బ్యాంకు రుణాలు ఇవ్వలేదని అన్నారు. ఆధార్ కార్డుతో సంబందం లేకుండా గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏర్మా పున్నం, జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, కావిరి రవి, సిడం సమ్మక్క, నాయకులు శ్రావన్, సంపత్, శ్రీకాంత్, మల్లేష్, ఆనంద్, వెంకటి, రాజన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని తాండూర్ సీఐ కుమారస్వామి సూచించారు. శుక్రవారం తాండూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శోభాయాత్ర సందర్భంగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించే ట్రాక్టర్ డ్రైవర్లు మద్యం సేవించరాదని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారులను బ్లాక్ చేయకుండా వరుస క్రమంలో వెళ్లాలని సూచించారు. వీధులలో ఉన్న విద్యుత్తు వైర్లను చూసుకుంటూ ముందుకు సాగాలన్నారు. శోభాయాత్ర సందర్భంగా డీజే పూర్తిగా నిషేధమని సాంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలతో, భజన సంకీర్తనలతో శోభయాత్ర సాగాలని తెలిపారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనకూడదన్నారు. అసాంఘిక శక్తులు ఎక్కడైనా అల్లార్లు సృష్టించే విధంగా ప్రయత్నిస్తే తక్షణమే పోలీసులకు లేదా (డయల్ 100)కి సమాచారం 8712656575 తెలియజేయాలన్నారు. అనంతరం నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా తాండూర్ పెద్ద చెరువును సందర్శించి అక్కడ ఏర్పాటను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్ఐ అంజన్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్, సీనియర్ నాయకులు మురళీధర్ రావు, మహేందర్ రావు, బానయ్య, ఈసా పాల్గొన్నారు.

ఎస్టీపీపీతో ఎలాంటి హాని లేదు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ ద్వార పరిసర గ్రామాలకు ఎలాంటి హానీ లేదని ప్లాంట్ ఈడీ రాజశేఖర్ రావు అన్నారు. ఎస్టీపీపీ నుండి వెలువడుతున్న వాయువు హానీకరంగా ఉన్నట్లు ఇటీవల సోషల్ మీడియా వార్తల పట్ల ఆయన స్పందించారు. యూనిట్-2 కాపిటల్ ఓవర్ హాలింగ్ 84 రోజుల పాటు మరమ్మత్తు పనులు చేపట్టిన విషయం తెల్సిందేనని అన్నారు. తదనంతరం యూనిట్-2 ప్రారంభించిన నేపద్యంలో 2 నుండి 3 గంటల పాటు కొంత మేరకు ప్లాంట్ చిమ్నీ నుండి దుమ్ము వెలువడిందని అన్నారు. అనంతరం ఆగిపోయి యదావిధిగా యూనిట్-2 కొనసాగిందని తెలిపారు. కాగా ఈ నెల 9న ఎస్టీపీపీ పరిసర గ్రామాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ పరికరం పీఎం 10 ద్వార మానిటర్ చేసి రిపోర్టు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఎస్టీపీపీ ప్లాంట్ నుండి వెలువడుతున్న దుమ్ము నేషనల్ అంబీయంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్ (ఎన్ఏఏయ్యూఎస్) ప్రకారం నియమ నిబంధనలకు లోబడి ఉన్నట్లు వెల్లడైందని అన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన డిప్యూటీ డీఈకి సన్మానం

నవతెలంగాణ-జైపూర్

ఇరిగేషన్ ఏఈగా విధులు నిర్వర్తించి డిప్యూటీ డీఈగా ఉద్యోగోన్నతి పొందిన అనుమాల విద్యాసాగర్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పదోన్నతి పొందిన విద్యాసాగర్ శుక్రవారం మొదటి సారిగా రామారావుపేట్ గ్రామానికి వచ్చిన సంధర్భంగా గ్రామస్థులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఇరిగేషన్ ఏఈ గా మండంలో విదులు నిర్వర్తించిన విద్యాసాగర్ డిప్యూటీ డీఈగా ఉద్యోగోన్నతి పొంది మహత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభ పరిశీలకులుగా రావడం ఆనందంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత, సోషల్ ఆడిట్ బృంధం సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీలకు అద్దె దుకాణాల కేటాయింపు

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలోని ఐదు దుకాణ సమూదాయాలను షెడ్యూల్డ్ కులాల వారికి అద్దె ప్రాతిపదికన కెటాయించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు షెడ్యూల్డ్ కులాల వారి నుంచి ధరఖాస్తులు స్వీకరించనుండగా అభ్యర్థుల వయస్సు 21-50 మధ్య ఉండాలని తెలిపారు. సంవత్సరాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్ష మించకుండా కనీస విద్యార్హత 5వ తరగతి చదువకుని ఉండాలని తెలిపారు. ధరఖాస్తులు కార్యాలయం పని వేళలలో ఉచితంగా పొందవచ్చునని, కోటపల్లి మండలానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 25 సాయంత్రం 5 గంటల వరకు నస్పూర్‌లో కలెక్టరేట్ భవనంలోని కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గట్రావ్ పల్లి గ్రామంలో శుక్రవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్య బ్రత శర్మ, యూనిట్ హెడ్ బాల గిరిధర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సంధర్భంగా గట్రావ్‌పల్లి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ శిబిరానికి హాజరు కాగా వారికి వైద్య సేవలు అందించి మందులను అందించారు. దూర ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, డాక్టర్ ఝాన్సీ పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టొద్దు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లాలోని ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణ పరిధిలోని ఇటిక్యాల, బొట్లకుంట చెరువులను మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఇరిగేషన్ ఈఈలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడినట్లయితే తొలగించడం జరుగుతుందని తెలిపారు. భూములను గుర్తించి ఇట్టి భూములలో ఏమైనా నిర్మాణాలు ఉన్నట్లయితే వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారు పనుల్లో పాల్గొనాలి

నవతెలంగాణ-జైపూర్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్నవారు పనుల నిర్వాహణలో పాల్గొనాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు అన్నారు. ఇందారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈజీఎస్ జాబ్ కార్డు కలిగివున్న ప్రతి ఒక్కరు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీ వెంకటేశ్వర్లు, డీఆర్పీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కళాశాలలో హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ భాష హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ అతీక్ బేగం పాల్గొని మాట్లాడారు. హిందీ భాష ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అలాగే హిందీ విభాగం శాఖాధిపతి డాక్టర్ సురేష్ పవార్ మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు శివాని, సోనీ హిందీ భాషలో ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, అధ్యాపకులు రేఖ, నరేష్, పృథ్వి, కునాల్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవతెలంగాణ-నార్నూర్



వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి కే.గంగాధర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేకంగా డ్రైడే సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో గ్రామాధికారులు అందరూ కలిసి పారిశుధ్య పనులను చేపట్టాలని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వారివెంట ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్ జాడి రాజలింగం, ఎంపీఓ స్వప్నశీలా, డాక్టర్ రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నవతెలంగాణ-ఉట్నూర్



అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఎవరు ఆపలేరని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి, ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్బంధాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, మీరెంత అణిచివేయాలని చూసినా ఉప్పెనలా లేస్తామని అన్నారు. మరో తెలంగాణ ఉద్యమం లేస్తుందని తెలిపారు. తప్పుడు మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని మీ దుర్మార్గాలను, మోసాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ముజీబ్, దూట మహేందర్, కోల సత్తన్న, కుర్సెంగా భూమన్న పాల్గొన్నారు.

తాంసి : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మద్దతుగా తాంసి మండల బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు బయలుదేరుతారనే సమాచారంతో నాయకులు వెళ్లకుండా ముందస్తుగా ఎస్సై శివరాం బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికి అక్కడ హౌస్ అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియంతగా వ్యవహరిస్తుందన్నారు. పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు హత్యాయత్నానికి ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. పోలీసులు అక్కడ ఉండి కూడా ఒక ఎమ్మెల్యేపై అంత దౌర్జన్యం చేసిన ఏమి చేయలేక పోయారన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు భయపడదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కంది గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, అశోక్, రఘు, నాగిరెడ్డి ఉన్నారు.

నార్నూర్ : హరీశ్‌రావు అక్రమ అరెస్టు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మీద జరిగిన దాడికి నిరసనగా హైదరాబాద్ వెళుతున్న ఉమ్మడి నార్నూర్, గాదిగూడ బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం సీఐ రహీమ్ పాషా, గాదిగూడ ఎస్సై మహేష్ పోలీసు సిబ్బంది ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ అడే, సయ్యద్ ఖాసీం, ఫిరోజ్‌ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు ఆడ రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, కోఆప్షన్ సభ్యులు జామ్డే బాబు, జవాడే భారత్, కోటంబే డిగాంబర్ ఉన్నారు.

పెంబి : హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో శుక్రవారం మండల బీఆర్ఎస్ నాయకులను పెంబి పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసేలా శాంతియుత నిరసనలను అడ్డుకుంటూ అక్రమ అరెస్టులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, సల్ల నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్గుల శేఖర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శంకర్, సుతారి మహేందర్, విలాస్, రమేష్, నానేష్, సొన్న రాజేందర్ పాల్గొన్నారు.

తలమడుగు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ అరికపూడి గాంధీ కారు గుర్తుతో గెలిచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాడని, వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, చేతి గుర్తుకు నిలబడి గెలిచి చూపించాలని అన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ చరిత్ర గల పార్టీని అన్నారు. తమ నాయకులపై దాడులు చేస్తే అడుగడుగునా నిలదీస్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తోట వెంకటేష్, కేదారేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ చంటి, పిడుగు అభిరామిరెడ్డి, కటకం దేవన్న, కాటిపెల్లి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఖానాపూర్ : మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టుకు నిరసనగా శుక్రవారం హైదరాబాద్ వెళ్తున్న ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులను ఎస్ఐ లింబాద్రి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్టు చేయడం కాదన్నారు. అనంతరం నాయకులను పోలీసులు విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ జెడ్పీటీసీ రాథోడ్ రామునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, తాళ్లపల్లి రాజగంగన్న, కొక్కుల ప్రదీప్, బూసి నరేందర్, కాలేరి దివాకర్, గౌరీకర్ రాజు, శనిగారపు శ్రవణ్, పుప్పాల గజేందర్ ఉన్నారు.

సెంట్రోల్ డ్రగ్ స్టోర్‌కు చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల సమీపంలో చేపట్టిన మందుల నిల్వ కేంద్రం నిర్మాణ పనులను ఆర్ఎంఓ శ్రీధర్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మందుల నిల్వ కేంద్రంలో హైదరాబాద్ నుండి వచ్చిన మందులను నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. మందుల నిల్వ కేంద్రం నుండి మంచిర్యాల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంతకు ముందు ఆదిలాబాద్ జిల్లా నుండి మందులు సరఫరా జరిగేదని, ప్రజల సౌకర్యార్థం స్థానికంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీనియర్లు కళాశాలకు వచ్చే జూనియర్లతో సక్రమంగా ఉంటూ చదువుల్లో రాణించేల ప్రోత్సహించాలని డీఐఈఓ రవీందర్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటిసంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రెండవ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐఈఓ పాల్గొన్నారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్ తో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీఐఈఓ రవీందర్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంటర్ ఎంతో కీలకమని ఇక్కడి నుంచే జీవితం ప్రారంభమవుతుందని తెలిపారు. మంచి నిర్ణయాలు తీసుకుంటూ ఉన్నతంగా రాణించాలన్నారు. అదే విధంగా ఫ్రెషర్స్ డే కార్యక్రమాలు సీనియర్, జూనియర్ల ఐక్యతను చాటుతాయన్నారు. కళాశాలలో చేరిన వారికి తొలి పండుగ ఫ్రెషర్స్ డే అని తెలిపారు. అనంతరం విద్యార్థినులు డీజే పాటలకు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు సురజ్ సింగ్, వెంకటేశ్వర్లు, ఐలయ్య, ప్రేమ్ చందర్ రెడ్డి, సాగర్, సుదర్శన్, చంద్రశేఖర్, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమా ఫలాలు అందేలా చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాడార్ల గంగ నర్సయ్యలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నవతెలంగాణ-తలమడుగు

ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీసీ వీటీఓలు ఎం.శ్రీనివాస్, మధు అన్నారు. శుక్రవారం మండలంలోని కుచులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటే ముందు రెండు వైపులా ఇతర వాహనాలను చూసి రోడ్డు దాటడం, వాహనాల వేగం గమనించాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న రాయితీ పాస్‌ల గురించి వివరించారు. అదేవిధంగా గమ్యం యాప్ గురించి తెలియజేశారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెంకోని వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని రెంకొనివాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కాగా శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రెంకొని వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు తగ్గు ముఖం పట్టగానే బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. అప్పటి వరకు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ గ్రామ పెట్రోల్ పంపు వద్ద శుక్రవారం బైక్‌పై వెళ్తున్న వెంకటేష్(30) కారును ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..యువకుడు తాగిన మైకంలో బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో చనిపోయిన రెవిన్యూ కార్యదర్శుల కుటుంబీకుల వారసులకు ఇటీవలే కారుణ్య నియామకాల కోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. అందులో పది మందికి ఆయా శాఖలలో పోస్టింగ్ కేటాయించారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా తన ఛాంబర్‌లో కారుణ్య నియామకాల ఉత్తర్వులను అందజేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఏఓ రాంరెడ్డి, నియామక ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు ఉన్నారు.

వినాయక నిమజ్జనం చెరువులు పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని వినాయక నిమజ్జన సందర్భంగా బంగల్‌పేట్ చెరువు ప్రాంతాన్ని ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి అన్ని విధాలా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శోభాయాత్ర నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, అధికారులు, గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అజీజ్ కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జు పరామర్శించారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని పట్టణంలోని అంబేద్కర్‌నగర్ గల ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, నాయకులు జన్నారపు శంకర్, వాసేఖాన్, కుటుంబ సభ్యులు జలీల్ ఉన్నారు.

కుర్చీల అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మాజీ వార్డు సభ్యుడు ఆయిల్ల శంకర్ తన తల్లి మల్లు రామవ్వ జ్ఞాపకార్థం నాలుగు కుర్చీలను అందించారు. ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మీనారాయణకు ఈ కుర్చీలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయిల్ల శంకర్ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి నాగేశ్వర్‌రావు, అన్నపూర్ణ, పుష్పలత, గ్రామ కార్యదర్శి వాజిద్, దళిత యువజన సంఘం నాయకుడు ఈర్ల సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో ఘనంగా అన్నదాన కార్యక్రమాలు

నవతెలంగాణ-ఖానాపూర్

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖానాపూర్ మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలోని మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ పోచమ్మ గల్లి కాలనీలో బాలల గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు చిలుకూరు గంగాధర్, అర్దెల వెంకటరమణ, నరేష్, రమేష్, రంజిత్, ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులో గల మధురనగర్ కాలనీలో మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం ఘనంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామచందర్, బలగం రమేష్, ప్రసాద్, శ్రావణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కౌమార దశలో మార్పులపై అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కౌమార దశలో శరీరంలో జరిగే మార్పుల పట్ల బాల, బాలికలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్ సూచించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు విద్యార్థులకు పోస్టర్ మేళా పోటీలు నిర్వహించారు. స్థానిక ఫాతిమా కాన్వెంట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ కౌమారదశలో బాల బాలికలకు శారీరక, మానసిక, ఉద్వేగపర మార్పులు సంభవిస్తాయని, వీటిపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగామన కల్పించాలని సూచించారు. హెచ్ఐవి, సంక్రమిత వ్యాధుల నివారణకు అవసరమైన జీవన నైపుణ్యాలను పెంపొందించడం, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, ఇతర ప్రమాదకర ప్రవర్తనలకు దూరంగా ఉండడం, భావ వ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం తదితర అంశాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన పోస్టర్ మేళాలో రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీకాంత్ ప్రథమ బహుమతి, సిర్పూరు టౌన్‌కు ఈడెన్ గార్డెన్ పాఠశాలకు చెందిన జుహా అబ్దుల్ ముస్తకీం ద్వితీయ బహుమతులు సాధించగా, వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సీతారాంనాయక్, క్లస్టర్ ప్రోగ్రామింగ్ మేనేజర్ నీలిమ, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాధికారి భిక్షపతి పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా శాంతికుమార్, వాసుదేవ్ వ్యవహరించారు.

సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ ధ్యేయం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పనిచేస్తుందని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పి-3 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మ్యాన్ రైటింగ్ చైర్స్ రబ్బర్స్ సరిపడా సరఫరా కావడం లేదని, సరఫరా అయిన రబ్బర్స్ కూడా నాసిరకంగా ఉండడం వల్ల మ్యాన్ రైడింగ్ చైర్స్ సరిపడలేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా వాటర్ ప్యూరిఫైడ్‌లను గనులలో ఏర్పాటు చేసిందని, వాటి మెయింటెనెన్స్ కొరకు ఎన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్(ఏఎంసీ) ద్వారా ప్యూరిఫైడ్స్ మరమ్మత్తులు చేసేవారని తెలిపారు. వెంటనే యాజమాన్యం స్పందించి మెయింటెనెన్స్ కాంట్రాక్ట్‌ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీచౌదరి, అంబాల రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు రోమోజీ, కాజీపేట విక్కి పాల్గొన్నారు.

పర్యవేక్షణ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంట కార్యక్రమాలు నిర్వహించే మహిళలకు నెలల తరబడి బిల్లులు రావడం లేదని, దీనితో భోజన నిర్వహణ కష్టసాధ్యంగా మారుతోందని అన్నారు. వీటిపై పాఠశాల ఉపాధ్యాయులను పర్యవేక్షణకు నియమించడంతో వారు అటు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై దృష్టి సారించలేక, ఇటు బోధనపై దృష్టి సారించలేక సతమతమవుతున్నారని అన్నారు. కాబట్టి దీని పర్యవేక్షణ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, పీఆర్‌సీ నివేదికను, నిర్వహణ గ్రాంట్‌ను విడుదల చేయాలని, పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు, సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆగష్టు నెల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కాగజ్‌నగర్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎనగంటి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా పత్తిపాక శ్రావణ్, అసోషియేట్ అధ్యక్షులుగా పి రామన్న ఉపాధ్యక్షులుగా జర్పుల లాలాజీ, మహిళా ఉపాధ్యక్షురాలిగా లింగంపల్లి స్వర్ణలత, కార్యదర్శిగా గంజి చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-బోథ్

రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలం కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ పంట కాలం ముగుస్తున్నా రైతులకు రైతు భరోసా నిధులు అందడం లేదని అన్నారు. అక్టోబర్ మాసం నుంచి రబి పంటలు ప్రారంభమవుతాయన్నారు. గత ప్రభుత్వం రెండు పంటలకు విడుతలా వారీగా ప్రతి రైతుకి ఒక ఎకరాకి పది వేల రూపాయలను రైతుబంధు నిధులను కింద విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఒక పక్క పంట రుణమాఫీ చేయక, మరొకపక్క రైతు భరోసా నిధులు రాక ప్రయివేటు వ్యాపారస్తుల దగ్గర నుంచి అప్పులు తెస్తున్నారని అన్నారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల పేరిట పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుకాలచే సర్వే చేస్తున్నా సందర్భం కనిపిస్తుందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ కోసం కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమావేశంలో రైతులు ముస్కు రాజేశ్వర్, మల్లన్న, మోతీరామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో ప్రతిష్టించిన అన్ని గణేష్ మండళ్ల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు. ఉదయం పదిన్నరకు స్థానిక రాయల్ ఫంక్షన్‌హాలులో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని మండళ్ల సభ్యులు హాజరు కావాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మత్తు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రోహిదాస్ జాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.